క్లుప్తంగా

రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాలి



రైతుసేవా కేంద్రంలో అధికారులు, రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ దాసి రాజు

మొగల్తూరు: వాతావరణంలో మార్పులు కారణంగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు పండించిన ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని ఆర్డీఓ డి.రాజు సూచించారు. మంగళవారం మొగల్తూరులోని రైతు సేవా కేంద్రం, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి అధికారులు, రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు రైతులకు ధాన్యం తడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. కోతలు కోసే సమయం ఉంటే గనుక పంట కోతను వాయిదా వేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు ధాన్యం అమ్మిన 48 గంటలలోపు వారి ఖాతాల్లో డబ్బు జమ చేస్తుందన్నారు. ఆయన వెంట ఏడీఏ అనిలకుమారీ, ఏఓ అబ్దుల్ రహీమ్, తహసీల్దార్ కె.రాజకిషోర్, సీఎస్ డీటీ సంధ్య, వీఆర్వో డి.సత్యనారాయణ తదితరులున్నారు.

రేపు ఉపాధి హామీ పనుల ప్రతిపాదనలపై సమావేశం

మొగల్తూరు: మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనులను ప్రతిపాదించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సమావేశంలో పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లు, ఇంజినీరింగ్, వెటర్నరీ, ఫిషరీష్ అసిస్టెంట్‌లు పాల్గొంటారని పేర్కొన్నారు. అధికారుల ప్రతిపాదనలతో గ్రామాల్లో త్వరలో గ్రామ సభలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

ప్రజలకు శుభ్రమైన మంచినీటిని అందించాలి



18వ వార్డులో కుళాయి ద్వారా సరఫరా అయిన మంచినీటిని పరిశీలిస్తున్న కమిషనర్

నరసాపురం: కుళాయిల ద్వారా ప్రజలకు శుభ్రమైన మంచినీరు అందే విధంగా సంబంధిత అధికారులు బాధ్యత తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సూచించారు. మంగళవారం కమిషనర్ 18, 24, 25, 31వ వార్డుల్లో అందుతున్న మంచినీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో క్లోరినేషన్ ప్రక్రియ సవ్యంగా సాగాలన్నారు. తగిన మోతాదులో క్లోరినేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ ప్రవీణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర త్రినాథ్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి

మొగల్తూరు: నియోజకవర్గ దళితుల ఆత్మీయ సమావేశాన్ని ఈ నెల 30న నిర్వహిస్తున్నామని, ఈ సమావేశాన్నివిజయవంతం చేయాలని మంగళవారం మొగల్తూరులో కరపత్రాన్ని ఆవిష్కరించారు. నరసాపురం మండలం సీతారాంపురం జె.బీర కాలేజీ ఆవరణలో నిర్వహించే ఈ సమావేశానికి నాయకులు, అభిమానులు తరలిరావాలని దళిత సంఘ నాయకులు కోరారు. కార్యక్రమంలో ఇంజేటి కుటుంబ రావు, సోడదాసి శ్రీదర్, పడవల సత్యనారాయణ, దొండపాటి స్వాములు, కత్తిమండ ముత్యాలరావు, డొల్ల రత్నరాజు, విప్పర్తి వెంకటేవ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం



ఏకాంబరేశ్వర, కామాక్షీ అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెనుగొండ: స్థానిక ఏకాంబరేశ్వర స్వామి, కామాక్షీ మాతల కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు రామడుగుల నరసింహమూర్తి, ఆలయ అర్చకుడు కె.సూర్యనారాయణ మూర్తి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో పూజలు అభిషేకాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు.

గుబులు రేపుతున్న వాతావరణం

- తుఫాన్ హెచ్చరికలతో అన్నదాతల బెంబేలు
- ధాన్యం రక్షించే పనిలో నిమగ్నం



సిద్ధాంతంలో ధాన్యం పట్టుబడుల్లో నిమగ్నమైన వ్యవసాయ కూలీలు



బరకాల మీద ధాన్యం రాశులుగా పోసిన దృశ్యం

పెనుగొండ: సాగు ఆఖరి దశలో వాతావరణంలో మార్పులు రైతన్నల గుండెల్లో గుబులు రేపుతుంది. రాబోయే రెండు మూడు రోజుల్లో తుఫాన్ ప్రభావం ఉంటుందంటూ వాతావరణ శాఖ హెచ్చరించడంతో ఆరుగాలాలు పాటు కష్టపడి పండించిన పంటను వర్షార్పణం కాకుండా రైతులు పంటను ఒబ్బిడి చేసుకొనే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సీజన్‌లో ఆది నుంచి సాగులో రైతులు అవస్థలకు గురవుతున్నారు. సాగు ప్రారంభంలోనే జూలైలో తుఫాన్ తాకిడితో వరి నాట్లు కుళ్లిపోయాయి. రెండో సారి నాట్లు వేయాల్సిన పరిస్థితి ఎదురైంది. ఇక నక్కల డ్రెయిన్ ఉధృతితో ఆచంట మండలంలో ఆచంట వేమవరం, వల్లూరు వంటి గ్రామాల్లో వరద నీటికి రెండు సార్లు వరిచేలు ముంపుకు గురయ్యాయి. ఆయా ప్రాంతాల్లో రెండు, మూడు సార్లు నాట్లు వేసుకోవాల్సి రావడంతో రైతులకు అధిక వ్యయమైంది.

దిగుబడిపై ప్రభావం

సెప్టెంబరు, అక్టోబరుల్లో కురిసిన వర్షాలతో ఈనిక దశలో పాలు తొడుకొనే శాతం తగ్గడంతో దిగుబడులపై ప్రభావం చూపింది, అయినా అందివచ్చిన పంటనే దక్కించుకుందామని రైతులు కోతలకు సమాయత్తం అయ్యారు. ఆచంట నియోజక వర్గంలో ఇప్పుడిప్పుడే కోతలు ప్రారంభమయ్యాయి. కోతలు పూర్తయిన చోట ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్నారు. ధాన్యం అంతా కల్లాలపైనే ఉంది. ఈ తరుణంలో తుఫాన్ హెచ్చరికలు రైతుల గుండెల్లో భయం రేపుతుంది. దీనికి తగ్గట్టుగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ వాతావరణమంతా మబ్బులతో నిండిపోయాయి. తేమశాతం ఉన్నా లేకపోయినా అయినకాడికి అమ్ముకోవడానికి రైతులు సిద్ధమవుతున్నారు. కొందరు ధాన్యాన్ని బరకాలతో కప్పుకుని రాశులను కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ఆచంట నియోజకవర్గంలో ఆచంటలో 10015 ఎకరాల్లోనూ, పోడూరు మండలంలో 12790 ఎకరాల్లోనూ. పెనుగొండ మండలంలో 11750 ఎకరాల్లోనూ. పెనుమంట్ర మండలంలోనూ 12156 ఎకరాల్లోనూ రైతులు వరిసాగు చేశారు. ఆయా మండలాల్లో ఇప్పటి వరకూ 10 శాతానికి పైగా కోతలు పూర్తి చేసి, ధాన్యం కల్లాలపై ఉంది. వీటిని రక్షించుకోవడంతో పాటు, వరికోతలు వారం రోజుల పాటు వాయిదా వేసుకోవాలని అధికారులు సూచనలు చేస్తున్నారు.

10 రోజులు వాతావరణం సహకరిస్తే చాలు



10 రోజుల పాటు వాతావరణం సహకరిస్తే చాలు రైతులు గట్టెక్కుతారు. విత్తన రకాలు కోతలు పూర్తి చేశారు. స్వర్ణ, ఎంటీయూ1318 రకాలు కోతకు వచ్చాయి. ఈ తరుణంలో తుఫాన్ హెచ్చరికలు భయపెడుతున్నాయి. ఏ మాత్రం ఈదురు గాలులు వచ్చినా పంట రైతకు దక్కడం కష్టం. ఇప్పటికే పెరిగిన సాగు వ్యయంతో నానా కష్టాలు పడుతున్నాం.

– తేతలి చిట్టిరెడ్డి, రైతు, పెనుగొండ

రైతులను అప్రమత్తం చేస్తున్నాం



తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు నష్టపోకుండా అప్రమత్తం చేస్తున్నారు. మండలాల్లో వ్యవసాయాధికారులు అందరూ రైతుల వద్దకే నేరుగా వెళ్లి వారం రోజుల పాటు కోతలు వాయిదా వేసుకోవాలని సూచించాం. అదేవిదంగా కోతలు పూర్తయిన ప్రాంతాల్లో ధాన్యాన్ని బరకాలతో ఒబ్బిడి చేసుకోవాలి.

– బి.నాగరాజు, ఆచంట మండల వ్యవసాయాధికారి

జోనల్ స్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ



ఆర్జేడీ నాగమణి చేతులు మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న రేణుక, దేవి ప్రసన్న

పెనుమంట్ర: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం భీమవరంలో జరిగిన జిల్లా స్థాయి, సోమవారం కాకినాడలో జరిగిన ఏడు జిల్లాల జోనల్ స్థాయి వక్తృత్వ పోటీల్లో మాముడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని చెల్లింకిల రేణుక ప్రథమ స్థానం సాధించిందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.రామకృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. భీమవరంలో జరిగిన పోటీల్లో తమ పాఠశాలకు చెందిన మరో విద్యార్థిని కోటిపల్లి దేవిప్రసన్నకు దేశభక్తి గీతాల పాటల పోటీల్లో తృతీయస్థానం లభించిందని వివరించారు. ఇద్దరికీ కాకినాడ విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ జి.నాగమణి చేతులు మీదుగా ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారని ఆయన పేర్కొన్నారు.

ఆక్వా యూనివర్సిటీ కళాశాల పరిశీలన



ఆక్వా కల్చర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలోని ఆక్వా యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ఆక్వా కళాశాలలో నిర్వహిస్తున్న తరగతులను మంగళవారం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే మూడో ఫిషరీస్ యూనివర్సిటీ నరసాపురంలో ఉండడం గర్వకారణమన్నారు. లిఖితపూడి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఫిషరీస్ యూనివర్సిటీ భవన నిర్మాణాలకు సంబంధించి ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల్లో కొంత మొత్తాన్ని కేటాయించారని, ఈ ఏడాది రెండవ బ్యాచ్‌కు సంబంధించిన తరగతులు కూడా లక్ష్మణేశ్వరంలోనే నిర్వహిస్తామన్నారు. అసోసియేట్ డీన్ టి.నీరజతో మాట్లాడి కళాశాలల విద్యార్థులకు వసతులు, ల్యాబ్‌లు తదితర విషయాలను గురించి ఆరా తీశారు. అనంతరం తరగతి గదులను పరిశీలించారు. అనంతరం ఆక్వా కల్చర్‌లో చేపలు, రొయ్యలకు వచ్చే వ్యాధుల నిర్ధారణ, చేయాల్సిన పరీక్షా విధానాలకు సంబంధించిన పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. సిలోమినా, లావణ్య, ఎస్.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

దర్బరేవు డ్రెయిన్ పరిశీలన

మొగల్తూరు: ముంపునకు గురైన రైతులు నష్టపోకుండా అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తెలిపారు. మొగల్తూరు పంచాయతీ కొత్తకాయలతిప్ప గ్రామం మీదుగా ప్రవహిస్తున్న దర్బరేవు డ్రెయిన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం లోటు బడ్జెట్‌లో ఉన్నందును త్వరలో దర్బరేవు డ్రెయిన్‌ను ఆధునీకరించి రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో డ్రెయిన్స్ డీఈ సత్యనారాయణ, ఏఈ పావని, సర్పంచ్ బందెల ఎలిషా, నాయకులు ఆరేటి రాజా, మేకల పరుశురామ్, లక్కు రాంబాబు, ముక్కు పుల్లయ్య పాల్గొన్నారు.

క్యాన్సర్ లక్షణాలపై అవగాహన అవసరం

పెనుమంట్ర: లివర్ క్యాన్సర్ లక్షణాలు దాని వల్ల వచ్చే అనర్థాలపై పారామెడికల్ సిబ్బంది హెల్త్ కేర్ ప్రొవైడర్స్ ప్రజల్లో అవగాహన కల్పించాలని తణుకు లలితా గ్యాస్ట్రో లివర్ ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. కమ్యూనిటీ పారామెడికల్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పెనుమంట్ర మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బ్రాహ్మణచెరువులో కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంపీ ఆర్‌ఎంపీలకు సదస్సు నిర్వహించి అనంతరం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్‌కే పరమేశ్వరరావు, ప్రసాద్, టి.సాయిబాబారెడ్డి, పి.గోపాలకృష్ణ, జి.నాగరాజు, డి.చంద్రరావు పాల్గొన్నారు.

30నే పింఛన్‌ల పంపిణీ

మొగల్తూరు: ఎన్టీఆర్ భరోసా పథకంలో పంపిణీ చేస్తున్న పింఛన్‌లను ఈ నెల 30నే పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పింఛన్‌లు పంపిణీ చేస్తారని స్పష్టం చేశారు.

పౌరులకు భారత రాజ్యాంగం వజ్రాయుధం



పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)



పెనుగొండ: ఇలపర్రులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



పాలకొల్లు సెంట్రల్: జీవీఎస్‌వీఆర్‌ఎం పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



నరసాపురం: బీజీబీఎస్ మహిళా కళాశాలలో బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు



మొగల్తూరు: తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు



నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరం సచివాలయం వద్ద రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ వజ్రాయుధం లాంటి భారత రాజ్యాంగాన్ని రచించి దేశ ప్రజలకు అందించారని, దాన్ని ప్రకారం నడచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా యాళ్లవానిగరువు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం అంబేడ్కర్ చిత్రపటానికి గుడాల గోపి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉచ్చుల స్టాలిన్, ఖండవల్లి వాసు, నిమ్మకాయల రామకృష్ణ, జోగాడ ఉమామహేశ్వరరావు, జవదాల సువర్ణరాజు, పిట్టా రాజ్‌కుమార్, కోలా వెంకట్, వీరవల్లి దుర్గారావు, గుడాల సురేష్, తలుపూరి బుజ్జి, ఇజ్జాడ చినబాబు, పైలా రాజశ్రీ, గంగిరెడ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే లంకలకోడేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జి.జనార్ధనరావు ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ ఐవీఎస్ రాజు, పీఈటీ కుక్కల సురేష్, సహోపాధ్యాయుడు పి.కనకదుర్గ, పి.అప్పలరాజు పాల్గొన్నారు.

పాలకొల్లు పట్టణంలో..

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయ ఉద్యోగులు, అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాల, ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ బి విజయసారథి మాట్లాడుతూ స్వాతంత్రాన్ని దృష్టిలో పెట్టుకుని భారతరాజ్యాంగాన్ని రచించిన దార్శనికుడు బాబాసాహెబ్ అంబేడ్కర్ అని కొనియాడారు. ఏఎస్ఎన్ఎం కళాశాలలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్ రాజ్యాంగ నిర్మాతల గొప్పతనాన్ని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎస్వీ రంగారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, ఏఎస్ఎన్ఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, డీఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు. అలాగే మాలమహానాడు ఆధ్వర్యంలో స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గుమ్మాపు సూర్యవరప్రసాద్, నల్లి రాజేష్, బద్దా అంతర్వేది, బుంగా జయరాజు పాల్గొన్నారు.

నరసాపురంలో...

నరసాపురం: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో, శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి ఆధ్వర్యంలో, బీజీబీఎస్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మధుషాలిని, ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ ఆఫీసర్ కె.రజనీ పాల్గొన్నారు. వైఎన్ కళాశాలలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్.చింతారావు, డీన్ గంధం రామకృష్ణ పాల్గొన్నారు. స్థానిక టాక్సీస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నరసాపురం మాలల ఐక్య వేదిక నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంజేటి జాన్‌కెనడీ, అడిదల శరత్, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు కాకిలేటి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం విశిష్టతను తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ దొండపాటి స్వాములు, చిలకపాటి జోసఫ్, నేత రవికుమార్, దాసరి రాజు, పాలపర్తి బోస్ పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: భారత రాజ్యాంగం రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను మనమంతా గుర్తించుకోవాలని తహసీల్దార్ కె.రాజకిషోర్ కోరారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సంధ్య పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జి.వాసు, నాగలక్ష్మి, ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు దినేష్, లక్ష్మీ పార్వతి, వెటర్నరీ ఆసుపత్రిలో డాక్టర్ నీలిమ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: ప్రతిఒక్కరూ రాజ్యాంగ విధులు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాదులు కె.చిట్టి పద్మజ, డి.చాముండేశ్వరి, కె నాగగిరీష పేర్కొన్నారు. మంగళవారం లక్ష్మణేశ్వరం రైతు భరోసా కేంద్రంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు న్యాయ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పెనుగొండలో..

పెనుగొండ: భారతదేశం నేటికీ పటిష్టమైన ప్రజాస్వామ్య దేశంగా ప్రపంచంలో నిలిచిందంటే భారత రాజ్యాంగమే కారణమని వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఇలపర్రులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన సంఘ సభ్యులు పీతల వెంకట్రావ్, చికిలే సుదర్శనరావు, చికిలే ఆహారోను, గూటం సంజీవరావు, కొలాటి నాగేశ్వరరావు, మంగం ఏసోబు రాజు పాల్గొన్నారు. పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో, పెనుగొండ శాఖా గ్రంథాలయంలో తేతలి సుబ్బారాయల రెడ్డి, తానేటి భాస్కర్ కుమార్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు



ఆంబోతుతిప్పలో ప్రత్యేకాలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వ స్వామి

మొగల్తూరు: కార్తీకమాసం మంగళవారం కావడంతో మండలంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రామన్నపాలెం పంచాయతీ ఆంబోతుతిప్పలో ఉన్న శ్రీవల్లిదేవ సేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. రామన్నపాలెం, పసలదీవి, కేపీ పాలెం గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని నాగదోష నివారణ పూజలు నిర్వహించుకున్నారు.

ఆంజనేయుని సన్నిధిలో ఏకాదశి పూజలు



ప్రత్యేకాలంకరణలో భక్తాంజనేయస్వామి

యలమంచిలి: స్థానిక మంచినీటి చెరువుగట్టున ఉన్న శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం కార్తీక ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి గోపి కృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో ఆంజనేయస్వామికి తమలపాకులు, గంగ సింధూరంతో అభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

మొగల్తూరులో కుంకుమ పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

మొగల్తూరు: కార్తీక మాసం నేపథ్యంలో మంగళవారం స్థానిక పార్వతీదేవి ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తలంక ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణ అంతా భక్తుల కోలాహలం నెలకొంది.

ఘనంగా లక్ష బిల్వార్చన



లక్షపత్రి పూజ నిర్వహిస్తున్న పండితులు

మొగల్తూరు: కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని మొగల్తూరులోని పురాతన పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పండితులతో పాటు ఆలయ అర్చకులు కొత్తలంక ప్రసాద్, బాపన్నల ఆధ్వర్యంలో స్వామివారికి లక్షపత్రి పూజను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన చేశారు.

లక్ష్మణేశ్వరంలో..



దుర్గాలక్ష్మణేశ్వరస్వామి సన్నిధిలో లక్ష బిల్వార్చన చేస్తున్న అర్చకులు

నరసాపురం రూరల్: కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని లక్ష్మణేశ్వరంలోని దుర్గాలక్ష్మణేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మంచిలి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ముదునూరి మోహ్రాజు, ముదునూరి నర్సింహరాజు దంపతులు లక్ష బిల్వార్చన చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చాగంటి సురేష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం రాత్రి రాజుల్లంక గ్రామ ప్రజల సహకారంతో అన్న ప్రసాద వితరణ చేశారు.